# డిజిటల్ అరెస్టు అంటే?

**మోసపోకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి?**

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: సైబర్ నేరగాళ్లు రోజుకో తరహాలో రెచ్చిపోతున్నారు. కొత్తగా 'డిజిటల్ అరెస్టు'ల పేరుతో జనాన్ని బెదిరిస్తున్నారు. ఆర్బీఐ, సీబీఐ, ఈడీ, కస్టమ్స్, పోలీస్ అధికారులమంటూ అమాయకులను మోసగించి అందినకాడికి డబ్బులు దోచుకుంటున్నారు. దేశంలో ఇలాంటి నేరాలు నానాటికీ పెరుగుతుండటంపై ప్రధాని నరేంద్రమోదీ సైతం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరహా కుంభకోణాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని నిర్దేశిత హెల్ప్‌లైన్ల ద్వారా తెలియజేయాలని ఇటీవల 'మన్ కీ బాత్' కార్యక్రమంలో సూచించారు.

### కుంభకోణం జరిగేది ఇలా..



మోసగాళ్లు తొలుత ఈడీ, సీబీఐ, ఆర్బీఐ, పోలీస్ అధికారులమని చెప్పుకుంటూ స్కైప్, జూమ్ ద్వారా అమాయకులకు వీడియో కాల్స్ చేస్తారు. మీరు తీవ్రమైన నేరాల్లో భాగమయ్యారని.. పన్ను ఎగవేతలు, ఆర్థిక అవకతవకలకు పాల్పడినందుకు మీపై కేసులు నమోదయ్యాయని భయపెడతారు. మనీ లాండరింగ్, స్మగ్లింగ్, డ్రగ్స్ కేసుల్లో మీ పేరు ఉన్నదని, కోర్టు ఆదేశాలతో మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నామని బెదిరిస్తారు. ఆపై ఎటూ కదలనివ్వకుండా విచారణ జరుపుతున్నట్టు నటిస్తారు. ఎదుటివాళ్లు నమ్మేలా యూనిఫాంలో కనిపిస్తారు. వారి వెనుక పోలీస్ లేదా సంబంధిత శాఖల లోగోలు కనిపించేలా చూసుకుంటారు. విచారణ చాలా గోప్యంగా జరగాలని, దీని గురించి ఎవరికైనా చెప్తే శిక్ష మరింత పెరుగుతుందని హెచ్చరిస్తారు. ఆ విచారణలో భాగంగా మీ వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలను తీసుకుని డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకుంటారు. లేదా ఈ కేసు నుంచి బయటపడాలంటే డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని చెప్తారు. అలా అందినకాడికి దోచుకుంటారు.

### నివారించడం ఇలా..




- మీకు కాల్ చేసింది ఎవరో గమనించాలి: డబ్బు చెల్లించాలని లేదా వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అందజేయాలని నిజమైన ప్రభుత్వ అధికారులెవరూ ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా అడగరన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి.
- ప్రశాంతంగా ఆలోచించాలి: మీకు ఏదైనా బెదిరింపు కాల్ గానీ, మెసేజ్ గానీ వస్తే ఓ క్షణం ఆలోచించాలి. మోసగాళ్లు ఏది చెప్తే అది వెంటనే చేసేయకూడదు. కేటుగాళ్లు ఎంత త్వరపెట్టినా ప్రశాంతంగానే ఉండాలి.
- వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాలి: నో యువర్ కస్టమర్ (కేవైసీ) డాటా, బ్యాంకు ఖాతా, వన్-టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) వివరాలు సహా సున్నితమైన మీ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయకూడదు.
- అప్రమత్తంగా వ్యవహరించాలి: గ్రమెటికల్ తప్పులతో కూడిన సందేశాలు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకూడదు.
- అనుమానాస్పద కార్యకలాపాలపై ఫిర్యాదు చేయాలి: అనుమానాస్పద సందేశాలు, లింకులు ఏమైనా వస్తే టెలికం విభాగం ఆధ్వర్యంలోని చక్షు పోర్టల్ లేదా 1930 లాంటి హెల్ప్‌లైన్ల ద్వారా ఫిర్యాదు చేయాలి.

# కృత్రిమ గర్భాల సాగు!

- సింథటిక్ గర్భం సాయంతో నచ్చిన ఫీచర్లతో బేబీ
- సంయోగం నుంచి జననం వరకు ప్రోగ్రామింగే
- 'బర్తింగ్ పాడ్స్'తో సాధ్యమేనంటున్న శాస్త్రవేత్తలు
- ఎలాన్ మస్క్ వంటి దిగ్గజ వ్యాపారవేత్తల ఆసక్తి





(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): బ్రాయిలర్ కోళ్లను ఫారాల్లో పెంచినట్టు.. పుట్టబోయే బిడ్డలను కూడా అత్యాధునిక ఫారాల్లాంటి పెట్టెల్లో ఉంచి పెంచితే ఎలా గుంటుంది? అండం-శుక్రకణం సంయోగం నుంచి బిడ్డ జననం వరకు మొత్తం ప్రోగ్రామింగ్‌పై ఆధారపడి నచ్చిన ఫీచర్లతో బిడ్డను కంటే ఎలాగుంటుంది?? ఈ ఊహలను నిజం చేసే రోజులు దగ్గరలో ఉన్నాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. బర్తింగ్ పాడ్స్‌ను ఉపయోగించి సింథటిక్ వూంబ్ లేదా ఆర్టిఫిషియల్ వూంబ్ (కృత్రిమ గర్భం) ద్వారా ఇది సాధ్యమేనంటున్నారు.

**ఏమిటీ 'కృత్రిమ గర్భం'?**

మహిళ గర్భంతో సంబంధం లేకుండా కృత్రిమ ఉమ్మనీళ్లు, బొడ్డుతాడును పోలిన నిర్మాణంతో రూపొందించిన గాజు సంచీలా (అండాకార పారదర్శక గాజు పెట్టె (బర్తింగ్ పాడ్)) కనిపించే 'కృత్రిమ గర్భం'. తల్లి గర్భంలో పిండానికి అందే అన్ని రకాల పోషకాలను, ఆక్సిజన్‌ను ప్రోగ్రామింగ్ సాయంతో కృత్రిమ గర్భంలోని పిండానికి సమపాళ్లలో అందిస్తారు. బిడ్డలో గుండె, మెదడు, ఇతర అవయవాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన తర్వాత ఎలక్ట్రోడ్లనే బటన్ సాయంతో బయటకు తీసుకొస్తారు. 2017లో అమెరికాలోని ఫిలడెల్ఫియా పరిశోధకులు 'బయోబ్యాగ్' పేరిట కృత్రిమ గర్భం ప్రొటోటైప్‌ను అభివృద్ధి చేశారు. కోడింగ్ దశలో ఇది విజయవంతంగా పనిచేసింది.

**కండ్లకు కట్టిన వీడియో**

ప్రముఖ ఫిల్మ్ డైరెక్టర్, బయోటెక్నాలజిస్టు హాషీం అల్-ఘైలీ సింథటిక్ వూంబ్‌కు సంబంధించిన వీడియోను తయారు చేశారు. దీని ప్రకారం.. పిండాన్ని బర్తింగ్ పాడ్‌లో పెంచుతారు. అందుకోసం ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ పద్ధతిని ఉపయోగిస్తారు. దాదాపు 75 ల్యాబ్‌లలో 400 చొప్పున పెట్టెలు ఉంటాయి. ఏటా 30 వేలమంది పిల్లలను పుట్టించడమే లక్ష్యంగా ఈ ల్యాబ్‌లు పనిచేస్తాయి. ఈ పెట్టెలకు ఏఐ ఆధారిత సెన్సర్లు ఉంటాయి. వాటి సాయంతో పెట్టెలోని శిశువు గుండెకొట్టుకొనే వేగం, ఉష్ణోగ్రత, ఆక్సిజన్ స్థాయిలను తెలుసుకోవచ్చు. ఇందులో అమర్చిన కెమెరా సాయంతో గర్భంలోని జన్యుపరమైన సమస్యలు తెలుసుకొని నియంత్రించవచ్చు. ఎప్పటికప్పుడు గర్భం పెరుగుదలను చూడొచ్చు. తల్లిదండ్రులు బిడ్డ పెరుగుదలను చూసేలా యాప్ ద్వారా అనుసంధానిస్తారు. బిడ్డను బయటకు తీయాలంటే ఆ బర్తింగ్ పాడ్‌పై ఉండే బటన్ నొక్కి చేతిలోకి తీసుకోవటమే. ఈ వీడియోను 'ఎక్టోలైఫ్ ఆర్టిఫిషియల్ వూంబ్ ఫెసిలిటీ' కోసం హాషీం రూపొందించారు.

**వాళ్లు ఇంతకుముందే తయారుచేశారు**

నెలలు నిండని, అవయవాలు అభివృద్ధి చెందకుండా ముందుగా పుట్టిన పిల్లల కోసం వెస్టర్న్ ఆస్ట్రేలియా యూనివర్సిటీ పరిశోధకులు ఓ కృత్రిమ గర్భాన్ని ఇదివరకే సృష్టించారు. ముఖ్యంగా 28 వారాలు నిండని పిల్లల కోసం దీన్ని తీసుకొచ్చారు. ఇది సత్ఫలితాలనిచ్చింది. ఇక, సింథటిక్ వూంబ్ టెక్నిక్‌కు సంబంధించి పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ కుబేరులైన ముగ్గురు వ్యాపార దిగ్గజాలు టెస్లా సీఈవో ఎలాన్ మస్క్, ఈ-కామర్స్ సంస్థ గుమ్‌రోడ్ వ్యవస్థాపకుడు సాహిల్ లావింగియా, క్రిప్టో కరెన్సీ కంపెనీ ఎథేరియమ్ వ్యవస్థాపకుడు విటాలిక్ బ్యూటరిన్ ఆసక్తి కనబరుస్తుండటం గమనార్హం.

**ఎందుకు అవసరం?**

జనానాల్లో అనూహ్య పెరుగుదల నమోదైతే ఆహార సంక్షోభం, వనరుల విధ్వంసం జరుగుతుంది. జననాల రేటులో తగ్గుదల నమోదైతే పనిచేసే యువతరం తగ్గిపోయి.. వృద్ధుల శాతం పెరిగిపోతుంది. ఫలితంగా ప్రపంచదేశాలు ఆర్థిక సంక్షోభాన్ని చవిచూస్తాయి. దీనికి చెక్ పెట్టే ప్రత్యామ్నాయమే సింథటిక్ వూంబ్. సంతానం ఎప్పుడు కావాలో, పిల్లల్ని ఎప్పుడు కనాలో, ఎందరిని కనాలో ప్రోగ్రామింగ్ ద్వారా టైమ్‌ను ఫిక్స్ చేసుకొనే వెసులుబాటు ఈ కృత్రిమ గర్భంలో ఉంటుంది.

**జన్యుపరమైన సమస్యలకు చెక్**

బర్తింగ్ పాడ్‌లో పెరుగుతున్న పిండం ఏదైనా జన్యుపరమైన సమస్యలను ఎదుర్కొన్నట్టు అనిపించినా, లేదా బిడ్డ రంగు, ముఖం, ముక్కు ఇలా బిడ్డ ఫీచర్లు మనకు నచ్చినట్టు కావాలనుకొన్నా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సెన్సర్ల సాయంతో ప్రత్యేక ప్రోగ్రామింగ్ కోడ్ ద్వారా మార్పులు చేర్పులు చేసే అవకాశం ఉంటుంది. తద్వారా అవయవ లోపంతో బిడ్డ పుట్టే ప్రమాదం అనేది ఉండదు. కాగా పూర్తిస్థాయి 'కృత్రిమ గర్భాన్ని' తయారు చేయాలంటే మరో పదేండ్లు పట్టొచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# జనన, మరణాల నమోదుకు మొబైల్ యాప్

**ప్రారంభించిన అమిత్ షా**

న్యూఢిల్లీ: జనన, మరణాలను సులువుగా నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్(సీఆర్ఎస్) పేరుతో రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా రూపొందించిన ఈ యాప్‌ను మంగళవారం న్యూఢిల్లీలోని జనగణన భవన్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారు. ఏ ప్రాంతం నుంచైనా, ఏ సమయంలోనైనా ఆయా రాష్ట్రాల అధికారిక భాషల్లో ఈ యాప్ ద్వారా జనన, మరణాలను నమోదు చేయవచ్చని అమిత్ షా పేర్కొన్నారు.

# ఘజియాబాద్ కోర్టులో జడ్జి, లాయర్ల వాగ్యుద్ధం

**లాయర్లపై పోలీసుల లాఠీచార్జి**

ఘజియాబాద్: యూపీలోని ఘజియాబాద్ జిల్లా కోర్టులో జడ్జి, లాయర్ల మధ్య వాగ్యుద్ధం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. బార్ అసోసియేషన్ అధికారికి సంబంధించిన ఒక కేసులో ఈ వివాదం జరిగింది. ఈ ఘటనలో కోర్టు రూములోని కుర్చీలను విసురుకున్నారు. పెద్ద యెత్తున వచ్చిన లాయర్లు.. జడ్జి చాంబర్‌ను చుట్టుముట్టడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగ ప్రవేశం చేసిన పోలీసులు వారిని చెదరగొట్టేందుకు లాఠీచార్జి చేశారు. దీంతో విధులు బహిష్కరించిన న్యాయవాదులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ జడ్జికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోర్టు ఆవరణలోని పోలీస్ ఔట్‌పోస్ట్‌ను చుట్టుముట్టారు. ఈ ఘటన తర్వాత న్యాయమూర్తి విధులను నిలిపివేశారు. బార్ అసోసియేషన్ నేతలను చర్చలకు పిలిచారు.

# కాంగ్రెస్ ఆరోపణలు నిరాధారం

**హర్యానా ఎన్నికలపై ఈసీ**

న్యూఢిల్లీ: హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు నిరాధారమని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొన్నది. పోలింగ్, కౌంటింగ్ జరిగే రోజుల్లో ఇలాంటి నిరాధార, సంచలన ఫిర్యాదులు లేవనెత్తడం ప్రజా అస్థిరతకు, అనవసర సంక్షోభానికి కారణం అవుతుందని, సామాజిక వ్యవస్థకు భంగం కలగొచ్చని ఈసీ పేర్కొన్నది. ఇలాంటి ఫిర్యాదులు మానుకోవాలని కాంగ్రెస్‌తో పాటు ఇతర రాజకీయ పార్టీలను కోరింది. 'ఇటీవల ముగిసిన హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియపై కాంగ్రెస్ లేవనెత్తిన నిరాధార ఆరోపణలను తిరస్కరిస్తున్నాం' అని ఈసీ మంగళవారం అధికారిక ప్రకటనలో పేర్కొన్నది.

# వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో జమిలి బిల్లు?


**కేంద్రం వ్యూహాత్మక అడుగులపై చర్చ**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా రాష్ట్రాల అసెంబ్లీలకు, పార్లమెంట్‌కు ఒకేసారి ఎన్నికలు (జమిలి ఎన్నికలు) నిర్వహించడానికి కేంద్రంలోని ఎన్డీయే సర్కారు అడుగులు వేస్తుందా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. వచ్చే ఏడాది జనగణన నిర్వహించి, 2026లో జనాభా లెక్కలను ప్రకటిస్తామని సోమవారం కేంద్రం ప్రకటించింది. 2028లో నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని వెల్లడించింది. మరోవైపు, 'ఒకే దేశం - ఒకే ఎన్నికల'కు సానుకూలంగా మాజీ రాష్ట్రపతి కోవింద్ ఇచ్చిన నివేదికకు గత నెలలోనే కేంద్ర క్యాబినెట్ ఆమోదం లభించింది. దీంతో మిత్రపక్షాలతో సంప్రదింపులు జరిపిన అనంతరం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనే జమిలికి సంబంధించిన బిల్లును ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్నదన్న అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి. కాగా జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే రాజ్యాంగంలో 18 వరకూ సవరణలు చేయాల్సి ఉంటుంది. ఏకకాల ఎన్నికల నిర్వహణకు లాజిస్టిక్స్ సమస్య కూడా ఎదురవ్వొచ్చని నిపుణులు చెప్తున్నారు. జమిలి బిల్లుకు ఎన్డీయేలోని ప్రాంతీయ పార్టీలు సానుకూలంగా ఓటేస్తాయా? అనేది మిలియన్ డాలర్ ప్రశ్నే.

# మరో 100 విమానాలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ: విమానాలకు బాంబు బెదిరింపులు ఆగడం లేదు. మంగళవారం 100కు పైగా విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. విమానాలు, హోటళ్లకు బెదిరింపు ఈ-మెయిళ్లు పంపిన 35 ఏండ్ల వ్యక్తిని నాగ్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. టెర్రరిజంపై పుస్తకం రాయడమే కాక, 2021లో ఒక కేసులో అరెస్టయిన జగదీశ్ ఈ నకిలీ బాంబు బెదిరింపులకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు.




# ఈ-చలాన్ పేరుతో కొత్త స్కామ్

**నకిలీ లింక్‌లు, ఎస్ఎంఎస్‌లతో జాగ్రత్త: కేంద్రం**

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: సైబర్ నేరగాళ్లు జనాన్ని మోసం చేసేందుకు కొత్త దారులు ఎంచుకుంటున్నారు. ఈ-చలాన్ పేరుతో మన బ్యాంక్ అకౌంట్లకు కన్నం వేస్తున్నారు. అధికారిక ఈ-చలాన్ వెబ్‌సైట్‌ను పోలి ఉండేలా నకిలీ వెబ్‌సైట్‌ను తయారుచేశారు. 'మీ వాహనానికి రూ.500 ట్రాఫిక్ చలాన్ పడింది. ఆన్‌లైన్ పేమెంట్ చేసేందుకు ఈ లింక్ క్లిక్ చేయండి' అంటూ జనానికి నకిలీ లింక్‌తో కూడిన ఎస్ఎంఎస్‌లు పంపిస్తున్నారు. ఈ లింక్ ఓపెన్ చేస్తే బ్యాంక్ అకౌంట్లు హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఈ చలాన్‌కు సంబంధించి https://echallan.parivahan.gov.in అసలైన లింక్ అని, సైబర్ నేరగాళ్లు https://echallanparivahan.in అనే నకిలీ లింక్‌ను పంపిస్తున్నారని పేర్కొన్నది. ఇలాంటి నకిలీ లింక్‌లను క్లిక్ చేయవద్దని సూచించింది.

# చెన్నపట్నలో గెలిస్తే డీకేనే సీఎం!

- కర్ణాటక కాంగ్రెస్‌లో మళ్లీ 'కౌన్ బనేగా సీఎం' చర్చ
- కుర్చీలాటలో కీలకంగా మారిన ఉప ఎన్నిక
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న డిప్యూటీ సీఎం శివకుమార్
- గెలిస్తే సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పీఠానికి ఎసరు?



బెంగళూరు, అక్టోబర్ 29: కర్ణాటక కాంగ్రెస్‌లో మళ్లీ ముఖ్యమంత్రి పదవిపై కుర్చీలాట మొదలయ్యింది. ఉప ముఖ్యమంత్రి, కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేసేలా అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆయన వర్గీయులు, ఒక్కలిగ సామాజికవర్గ నేతలు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం వచ్చే నెల 13న జరగనున్న చెన్నపట్న అసెంబ్లీ నియోజవర్గ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నారు.

**ప్రతిష్ఠాత్మకంగా చెన్నపట్న ఉప ఎన్నిక**

కుమారస్వామి రాజీనామాతో ఖాళీ అయిన చెన్నపట్న నియోజకవర్గం డీకే శివకుమార్ సొంత జిల్లా అయిన రామనగరలో ఉంది. 2009 నుంచి కాంగ్రెస్ ఇక్కడ ఒక్కసారీ గెలవలేదు. జేడీఎస్‌కు, దేవెగౌడ కుటుంబానికి ఇది పట్టున్న ప్రాంతం. ఉప ఎన్నికలో జేడీఎస్ తరఫున, బీజేపీ మద్దతుతో కుమారస్వామి కుమారుడు నిఖిల్ పోటీ చేస్తున్నారు. దీంతో ఈ ఉప ఎన్నిక కర్ణాటక రాజకీయాల్లో కీలకంగా మారింది. ఐదుసార్లు ఇక్కడి నుంచి గెలిచిన సీపీ యోగేశ్వరను కాంగ్రెస్ బరిలో నిలిపింది. ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే సీఎం పదవికి చేరువ కావొచ్చని డీకే శివకుమార్ భావిస్తున్నారు. అందుకే 'నేను అభ్యర్థిని అనుకొని ఓటు వేయండి' అంటూ ఆయన చెన్నపట్న ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

**డీకే గెలిస్తే సిద్ధూకు చిక్కులే**

డీకే వర్గీయులు కూడా చెన్నపట్నలో గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. 'ఈ ఎన్నిక డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అయ్యేలా చేస్తుంది. ఉప ఎన్నిక ఫలితం డీకే శివకుమార్ నాయకత్వాన్ని ప్రతిబింబిస్తుంది.' అంటూ డీకే వర్గీయుడు, ఎమ్మెల్యే శివలింగె గౌడ ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ కనుక కాంగ్రెస్ గెలిస్తే డీకేను సీఎం చేయాలని హైకమాండ్‌పై ఆయన వర్గీయులు ఒత్తిడి పెంచనున్నారు. ఇప్పటికే ముడా స్కామ్‌తో సతమతమవుతున్న సీఎం సిద్ధరామయ్యకు ఈ ఉప ఎన్నిక మరో తలనొప్పిగా మారింది.

# తీహార్ జైలు వార్డెన్ కనుసన్నల్లో డ్రగ్స్ ఫ్యాక్టరీ

- 95 కిలోల డ్రగ్స్ స్వాధీనం
- అయిదుగురి అరెస్ట్

న్యూఢిల్లీ: మెక్సికన్ డ్రగ్స్ ఉత్పత్తిదారులతో సంబంధాలు కలిగిన డ్రగ్స్ తయారీ ల్యాబ్ గుట్టును రట్టు చేసినట్టు మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో(ఎన్సీబీ) మంగళవారం తెలిపింది. ఈ నెల 25న యూపీలోని గౌతమ్ బుద్ధ్ నగర్ జిల్లాలోని కస్నా పారిశ్రామిక ప్రాంతంలో ఈ ల్యాబ్‌ను గుర్తించి 95 కిలోల మెథంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పింది. ఈ ఘటనలో తీహార్ జైలు వార్డెన్, ఇద్దరు ఢిల్లీ వ్యాపారవేత్తలు సహా అయిదుగురిని అరెస్ట్ చేసినట్టు వెల్లడించింది. ఇందులో ఒక వ్యాపారవేత్త గతంలో డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయ్యాడని, అతడు తీహార్ జైల్ వార్డెన్‌తో సంబంధాలు ఏర్పరుచుకొన్నాడని తెలిపింది. జైలు వార్డెన్ డ్రగ్స్ ఉత్పత్తికి అవసరమైన రసాయనాలు కొనుగోలు చేయడంలో అతడికి సహకరించాడని వెల్లడించింది. దేశ రాజధాని ప్రాంతంలో ఈ డ్రగ్స్ ముఠా విస్తరించి ఉందని ఎన్సీబీ తెలిపింది. ముంబైకి చెందిన కెమిస్ట్ సాయంతో ఈ ముఠా డ్రగ్స్‌ను తయారు చేసి, మెక్సికన్ డ్రగ్స్ ఉత్పత్తిదారుల ముఠా సభ్యుడితో నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నదని చెప్పింది.

# 70 ఏండ్లు పైబడిన అందరికీ ఆయుష్మాన్ భారత్

**ప్రారంభించిన ప్రధాని మోదీ • ఎయిమ్స్ దవాఖానల్లో డ్రోన్ సేవలు**

న్యూఢిల్లీ: కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం ఇక నుంచి 70 ఏండ్ల పైబడిన అందరికీ వర్తించనుంది. తొమ్మిదో ఆయుర్వేద దినోత్సవం, ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఢిల్లీలో వయో వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ పథకం కింద 70 ఏండ్ల వయసు దాటిన అందరికీ ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ఉచిత వైద్యం అందనుంది. వయోవృద్ధులు ఉచిత చికిత్స పొందేందుకు వీలుగా 'ఆయుష్మాన్ వయ వందన కార్డు'లను అందించనున్నట్టు ప్రధాని మోదీ ప్రకటించారు. కాగా, ఈ పథకాన్ని ఢిల్లీ, బెంగాల్ ప్రభుత్వాలు రాజకీయ కారణాలతో అమలు చేయడం లేదని మోదీ ఆరోపించారు. ఇక్కడి వయో వృద్ధులను ఆయన క్షమాపణ కోరారు. మరో రూ.12,850 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు ప్రాజెక్టులను సైతం మోదీ ఆవిష్కరించారు. మధుమేహం, జీవక్రియకు సంబంధించిన రుగ్మతల చికిత్సలో ఆయుర్వేద వినియోగం కోసం బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌ను, దేశవ్యాప్తంగా 11 ఎయిమ్స్ దవాఖానల్లో డ్రోన్ సేవలను సైతం మోదీ ప్రారంభించారు.

# మహారాష్ట్రలో ముగిసిన నామినేషన్ల పర్వం

**15 సీట్లలో అభ్యర్థులపై కొనసాగుతున్న సందిగ్ధత**

ముంబై, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల పర్వం మంగళవారంతో ముగిసింది. అయితే 15 సీట్లలో పోటీ చేసే అభ్యర్థులపై పార్టీల్లో ఇంకా స్పష్టత కొరవడింది. అధికార బీజేపీ, శివసేన, ఎన్సీపీ (అజిత్ పవార్) వర్గంలో నాలుగు సీట్లకు ఇంకా అభ్యర్థులను ప్రకటించ లేదు. ఇక విపక్ష మహా వికాస్ అఘాడీలోని శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీలు 11 స్థానాల్లో అభ్యర్థుల ప్రకటనపై మల్లగుల్లాలు పడుతున్నాయి. ఇప్పటివరకు బీజేపీ 152, అజిత్ పవార్ ఎన్సీపీ 52, ఏక్ నాథ్ షిండే శివసేన 80 సీట్లలో అభ్యర్థులను రంగంలోకి దించింది. ఇందులో చిన్న పార్టీలకు చెందిన వారు కూడా ఉన్నారు. అలాగే ఎంవీఏలో కాంగ్రెస్ 103, ఉద్ధవ్ ఠాక్రే శివసేన 87, శరద్ పవార్ ఎన్సీపీ 87 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఇంకా 11 సీట్లకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అయితే వాటిలో కొన్ని సమాజ్‌వాది పార్టీ లాంటి మిత్రపక్షాలకు కేటాయించవచ్చని ప్రచారం జరుగుతున్నది.

# అయోధ్యలో వానరాల కోసం అక్షయ్‌కుమార్ కోటి విరాళం

ముంబై, అక్టోబర్ 29: బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ అయోధ్యలో వానరాల పట్ల అంతులేని ఔదార్యాన్ని కనబర్చారు. వాటి ఆహారం కోసం రూ.కోటి విరాళం ప్రకటించారు. అయోధ్య నగరంలో వానరాల పోషణ నిమిత్తం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న 'ఆంజనేయ సేవా ట్రస్ట్' వారికి ఈ విరాళాన్ని అందజేయనున్నట్టు అక్షయ్ కుమార్ తెలిపారు. తాను చేస్తున్న ఈ సేవ దివంగతులైన తన తల్లిదండ్రులు, తన మామ, బాలీవుడ్ వెటరన్ నటుడు రాజేశ్ ఖన్నాలకు అంకితం చేస్తున్నానని అక్షయ్‌కుమార్ తెలిపారు. కోతుల ఆహారం కోసం ఆయన భారీ విరాళం ప్రకటించటంపై 'ఆంజనేయ సేవా ట్రస్ట్' ఫౌండర్ ప్రియా గుప్తా హర్షం వ్యక్తం చేశారు.

# కేరళ ఆలయంలో బాణసంచా పేలుడు 150 మందికి గాయాలు

కాసరగోడ్, అక్టోబర్ 29: కేరళలోని కాసరగోడ్ జిల్లాలో సోమవారం రాత్రి జరిగిన బాణసంచా పేలుడులో 150 మంది గాయపడ్డారు. వీరిలో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. నీలేశ్వరం సమీపంలోని వీరర్‌కవు దేవాలయంలో ప్రజలు తెయ్యం ప్రదర్శన చూస్తుండగా, అక్కడ నిల్వ ఉంచిన టపాసులు పేలడంతో ఈ ప్రమాదం సంభవించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బాధితులను వివిధ దవాఖానలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. 'భద్రతకు సంబంధించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదు. తెయ్యం ప్రదర్శనకు, టపాసుల నిల్వకు కనీసం 100 మీటర్ల దూరాన్ని పాటించాలన్న నిబంధనను పాటించలేదు. టపాసుల నిల్వకు అనుమతి తీసుకోలేదు' అని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# హెజ్బొల్లా కొత్త చీఫ్‌గా నయీమ్ ఖాసీం



బీరుట్, అక్టోబర్ 29: లెబనాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ హెజ్బొల్లా కొత్త చీఫ్‌గా మంగళవారం నయీమ్ ఖాసీం నియమితులయ్యారు. ఆ సంస్థ చీఫ్ హసన్ నస్రల్లాను ఇజ్రాయెల్ దళాలు గత నెలలో హతమార్చిన సంగతి తెలిసిందే. నస్రల్లాకు చాలాకాలంగా డిప్యూటీగా వ్యవహరిస్తున్న 71 ఏండ్ల ఖాసీం ఆయన మృతి తర్వాత తాత్కాలిక నేతగా వ్యవహరిస్తున్నారు. హెజ్బొల్లాలో నిర్ణయాధికారం ఉన్న షురా కౌన్సిల్ ఖాసీంను కొత్త సెక్రటరీ జనరల్‌గా ప్రకటించింది. నస్రల్లా విధానాలను అనుసరిస్తూ, విజయం సాధించే వరకు శ్రమిస్తానని ఖాసీం ప్రతిజ్ఞ చేశారు.

**ఇజ్రాయెల్ దాడిలో 90 మందికిపైగా మృతి**

ఉత్తర గాజాస్ట్రిప్‌లో ఐదంతస్తుల భవనంపై మంగళవారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 90 మందికిపైగా పౌరులు మరణించారు. ఈ భవనంలో నిరాశ్రయులు తల దాచుకుంటున్నట్టు గాజా ఆరోగ్య శాఖ పేర్కొంది. కాగా, పాలస్తీనా శరణార్థులకు సహాయం చేస్తున్న యూఎన్ఆర్‌డబ్ల్యూపై ఇజ్రాయెల్ నిషేధం విధించింది.

# అమెరికాలో ఆర్థిక ఎమర్జెన్సీ: మస్క్

న్యూఢిల్లీ: అగ్రరాజ్యం అమెరికా ఆర్థిక అత్యవసర స్థితిలోకి వెళ్లిపోయిందని ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులపై ప్రభుత్వం చెల్లిస్తున్న వడ్డీలు ఏడాదికి ట్రిలియన్ డాలర్లు (రూ.84 లక్షల కోట్లు) దాటిపోయాయని, రక్షణ రంగానికి చేసిన కేటాయింపుల కంటే ఇది ఎక్కువని పేర్కొన్నారు. ఇటీవల ట్రంప్ ఎన్నికల ప్రచార ర్యాలీలో మస్క్ మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ వడ్డీ చెల్లింపులు ఫెడరల్ ట్యాక్స్ ఆదాయంలో 23 శాతమని తెలిపారు. జాతీయ రుణం 35.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని పేర్కొన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ రుణం 36 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని బ్యాంక్ ఆఫ్ అమెరికా అంచనా వేసినట్టు వివరించారు.



# విల్లా కొంటే లాంబొర్గిని ఫ్రీ


**నోయిడా రియల్టీ సంస్థ ఆఫర్**

నోయిడా, అక్టోబర్ 29: లగ్జరీ విల్లాలను విక్రయించేందుకు నోయిడాకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రకటించింది. తమ విల్లాలు కొనుగోలు చేసిన కస్టమర్లకు ఖరీదైన లాంబొర్గిని కారును ఉచితంగా ఇస్తామని వెల్లడించింది. జేపీ గ్రీన్స్ అనే ప్రముఖ రియల్టీ సంస్థ ఇచ్చిన ఈ ఆఫర్‌ను గౌరవ్ గుప్తా అనే రియల్టర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్‌గా మారింది. ఈ సంస్థ గ్రేటర్ నోయిడాలో లగ్జరీ విల్లాలను నిర్మించింది. రూ.26 కోట్లు ఖరీదు చేసే ఈ విల్లాలను కొనుగోలు చేస్తే రూ.4 కోట్ల విలువ చేసే లాంబొర్గిని ఉరుస్ కారును ఉచితంగా ఇవ్వనున్నట్టు వెల్లడించింది.

# ఒకేసారి కీమోథెరపీ, ఫొటోథెరపీ

- క్యాన్సర్‌కు కొత్త చికిత్స
- అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలు

న్యూయార్క్: క్యాన్సర్ మహమ్మారికి అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)కి చెందిన శాస్త్రవేత్తలు సరికొత్త చికిత్స విధానాన్ని అభివృద్ధి చేశారు. కీమోథెరపీతో పాటు ఫొటోథెరపీని ఒకేసారి చేయడం ద్వారా సమర్థంగా క్యాన్సర్ కణతులను నాశనం చేయొచ్చని వీరు గుర్తించారు. ఈ చికిత్స ద్వారా సైడ్ ఎఫెక్ట్స్‌ను తగ్గించడంతో పాటు బాధితుల జీవితకాలాన్ని పెంచవచ్చని పరిశోధకులు చెప్తున్నారు. క్యాన్సర్‌కు ఇటీవల కొత్తగా ఫొటోథెరపీ అనే చికిత్స విధానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది క్లినికల్ ట్రయల్స్ దశలో ఉంది. ఈ చికిత్సలో భాగంగా బంగారు నానోపార్టికల్స్‌ను శరీరంలోని క్యాన్సర్ కణతుల వద్దకు పంపించి, బయటి నుంచి లేజర్ ద్వారా వాటిని వేడి చేస్తారు. ఇవి సమీపంలోని క్యాన్సర్ కణాలను అంతం చేస్తాయి.



**ఒకేసారి రెండు చికిత్సలు**

క్యాన్సర్ చికిత్సకు ఎక్కువగా వినియోగిస్తున్న కీమోథెరపీతో పాటు ఫొటోథెరపీని ఏకకాలంలో చేయడమే ఎంఐటీ శాస్త్రవేత్తలు చెప్తున్న కొత్త చికిత్స విధానం. ఇందుకోసం వీరు మాలిబ్డినం సల్ఫైడ్ అనే నిరింద్రియ పదార్థంతో పాటు కీమోథెరపీకి వినియోగించే ఔషధాన్ని కలిపి సూక్ష్మ కణాలను తయారు చేసి వినియోగించారు. ఇవి లేజర్ లైట్‌ను 50 డిగ్రీల సెల్సియస్ వేడిగా మార్చడంలో సమర్థంగా పని చేస్తాయని, క్యాన్సర్ కణాలను అంతం చేయడానికి ఈ వేడి సరిపోతుందని పరిశోధకులు తెలిపారు. ఈ సూక్ష్మకణాలు వేడికి కరిగిపోయి వాటిల్లోని కీమోథెరపీ ఔషధాన్ని విడుదల చేస్తాయని చెప్పారు.



# ఉదయనిధి వస్త్రధారణపై హైకోర్టులో పిటిషన్

చెన్నై, అక్టోబర్ 29: తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ వస్త్రధారణపై మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. డిప్యూటీ సీఎంగా ఆయన సరైన డ్రెస్ కోడ్ పాటించటం లేదని, పార్టీ చిహ్నాలను ప్రదర్శించే దుస్తులను ధరించి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, ఇది రాజ్యాంగ ఉల్లంఘన కిందికి వస్తుందని పిటిషన్‌లో ఆరోపించారు. దీనిపై స్పందన తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. ప్రభుత్వ అధికారులు, రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారికి ఫార్మల్ డ్రెస్ కోడ్ వర్తిస్తుందా? లేదా? అన్నది పరిశీలించాలని అడ్వొకేట్ జనరల్‌ను కోరింది. ఉదయనిధి స్టాలిన్ ఫార్మల్ డ్రెస్ కోడ్ పాటించటం లేదని పిటిషన్‌దారు ఆరోపించారు.